క్లుప్తంగా

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన దృశ్యం

గొలుగొండ: రామచంద్రపురం గ్రామ సమీపంలో శ్మశాన వాటిక భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇక్కడ భూములు ఆక్రమణలకు గురికావడంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

మాడుగుల రూరల్: సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంబించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ ప్రాంతీయ సమన్వయకర్తలు ప్రకాష్, హేమసుందర్ తెలిపారు. బుధవారం ముకుందపురంలో నవ ధాన్యాలు నేలతల్లి బాగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 4,150 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది 18 నుంచి 30 రకాల నవధాన్యాల విత్తనాలు పొలాల్లో జల్లేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వీటిని 45 రోజుల తర్వాత భూమిలో కలియదున్నాలని వివరించారు. ఈ విధంగా చేయడం వల్ల భూమిలో కర్బన శాతం, సూక్ష్మజీవులు పెరుగుతాయన్నారు. తద్వారా మొక్కలకు కావల్సిన అన్ని రకాలు పోషకాలు భూమికి అందుతాయన్నారు. పంటలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తొలుత బీజామృతంతో విత్తన శుద్ధి చేయించారు. మండల ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి గండి శ్రీనివాసరావు, సిబ్బంది నాగమణి, గోవిందమ్మ, నాగేశ్వరరావు, వరలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 43 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్ట్

చీడికాడ: శంకర ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఖండివరం బుధవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 102 మందికి ఆప్తాలమిస్టు పరీక్షలు చేశారు. వీరిలో 43 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు క్యాంపు డిప్యూటీ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. వీరిని ప్రత్యేక బస్సులో విశాఖ తరలిస్తామన్నారు. శస్త్రచికిత్సలకు ఎంపికైన వారిలో చిన్న పిల్లలు ఒకరు ఉండడంతో ప్రత్యేక నిపుణులు ద్వారా చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పెద్దలతోపాటు ఆప్తాలమిక్ అధికారి హరిచందన, తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండో విడత చందన సమర్పణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దిబ్బవీధి వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి రెండో విడత చందన సమర్పణ చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6, సాయంత్రం 7 గంటలకు దీపాలంకరణ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 415 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,800	5,150
మొదటి రకం	4,670	5,190
రెండో రకం	4,145	4,400
మూడోరకం	3,735	3,870

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-40 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-27 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.



పంపిణీకి సిద్ధమవుతున్న సరుగుడు నారు



మొక్కల సంరక్షణలో ఉపాధి కూలీలు

పంపిణీకి మొక్కలు సిద్ధం

- రైతులకు ఉచితంగా అందించనున్న అటవీశాఖ
- 3 వన నర్సరీల్లో పెంపకం
- వేసవిలో ఆరోగ్య సంరక్షణ చర్యలు

కె.కోటపాడు: అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరుణంలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు రైతులు వివిధ కారణాలతో దీర్ఘకాలిక పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా మెట్ట భూముల్లో సరుగుడు, టేకు వంటి పంటలు వేస్తున్నారు. ఇటువంటి వారి కోసం మండలంలో కొత్త అగ్రహారం, రామచంద్రపురం, సింగన్నదొరపాలెం గ్రామాల్లో సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో వన నర్సరీలు పెంచుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో విరివిగా మొక్కల పెంపకాన్ని నిర్వహించడం ద్వారా వాతావరణ సమతుల్యత కలిగించేందుకు గాను సామాజిక అటవీ శాఖ అధికారులు నర్సరీల ద్వారా రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తుంటారు. ఇందుకుగాను పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, పంచాయతీ కార్యదర్శి సంతకంతో కూడిన దరఖాస్తు ఫాం సమర్పించాల్సి ఉంటుంది. వీటితో పాటు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటుతున్నారు. మరికొద్ది రోజుల్లోనే వాతావరణ పరిస్థితులు అనుకూలించి విస్తారంగా వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పై మూడు గ్రామాల్లోని వన నర్సరీల్లో మొక్కలను కలెక్టర్, డీఎఫ్‌వో ఆదేశాల మేరకు వచ్చే నెల రైతులకు పంపిణీ చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు



నర్సరీలో ఆరోగ్యకరంగా టేకునారు

చేపట్టనున్నారు. వేసవి దృష్ట్యా నర్సరీలలో పెంపకం చేస్తూ మొక్కలకు సకాలంలో నీటి తడులను అందిస్తూ ఆరోగ్యకరంగా ఉండేట ట్లు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పలు రకాల మొక్కలు: మూడు నర్సరీల ద్వారా రైతులకు ఉచితంగా అందించేందుకు సరుగుడు మూడు లక్షల నారు, టేకు 50 వేల మొక్కలు, నీలగిరి, బాదం, తెల్లమద్ది, గంగిరేం, పనస, జంబోనేరడి, కానుగ, ఏనుగుపాదం, కదంబ, రావి ప్రస్తుతం 30 వేల మొక్కలు ఉన్నాయి. వీటితోపాటు జీడి, ఉసిరి, జామ 17 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వర్షాలు పడే సమయంలో ఈ మొక్కలు నాటడం మంచిదని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు



మూడు గ్రామాల్లో వన నర్సరీలు నిర్వహిస్తున్నాం. ఖరీఫ్ వర్షాల సమయంలో రైతులు అధికంగా సరుగుడు, టేకు తదితర మొక్కలు నాటనున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలను అందించేందుకు నర్సరీలలో పెంచుతున్నాం. కలెక్టర్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఆదేశాలు వచ్చిన తర్వాత రైతులకు అందించనున్నాం.

– చిరికి గోవింద, వన సంరక్షకుడు, కొత్త అగ్రహారం

రైతులకు అండగా అగ్రి ల్యాబ్



మాడుగులలో నూతనంగా నిర్మించిన అగ్రి ల్యాబ్ భవనం



మాడుగుల అగ్రి ల్యాబ్‌లో పేడ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మాడుగుల: నియోజకవర్గానికి ఒక అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేయడం వల్ల పాడి రైతులకు వరంగా మారింది. పశు వ్యాధులకు సకాలంలో రక్త, పేడ, పొదుగు వాపు, పారుడు వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వెంటనే మందులు అందజేస్తున్నారు. దీనివల్ల వ్యాధులు నయం కావడంతోపాటు పాల దిగుబడి పెరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ సేవలు పొందాలంటే విశాఖకు శాంపిల్స్ పంపించి తిరిగి వచ్చేసరికి వ్యాధులు ముదిరి మృత్యువాత పడేవి. నేడు అగ్రి ల్యాబ్‌లు అందుబాటులోకి రావడంతో పశువులకు సకాలంలో వైద్యం అందుతోంది. ప్రతి నెలా 500 పశువులకు పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని, యాంటీ బయోటిక్ మందులు అధికంగా వాడకుండా అవసరమైన మోతాదులో చికిత్స చేస్తున్నామని ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవం

మాకవరపాలెం: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక బస్టాండు పక్కనే వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నిర్మించి గురువారం నాటికి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

నేడు బ్రాహ్మణి ముత్యాలమ్మ పండగ

పరవాడ: పరవాడ గ్రామంలో వెలసిన బ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగను గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా అమ్మవారు స్థానికుల పూజలను అందుకుంటున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు తరలివస్తారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించి, పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో పరవాడ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని, అమ్మవారి దర్శనం అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తారు. రాత్రికి డప్పులు, చిడతలు, తప్పెటగుళ్ల, డ్యాన్సులు, నేల డ్యాన్సులతో అమ్మవారిని వీధుల్లో ఊరేగిస్తారు. భారీ బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహిస్తారు. భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మోదమాంబకు కుంకుమ పూజలు



మోదమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు స్వగృహంలో ఏర్పాటు చేసిన మోదమాంబ అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామంలో అమ్మవారి మాలాధారణ భక్తుల ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 9 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో విస్తం ప్రతినిధులు



జాబ్‌మేళాలోఎంపికైన విద్యార్థులతో వివిధ కంపెనీల ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి మండలం పినగాడి సమీపంలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. యోకోమో కంపెనీలో 9 మంది డిప్లొమా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు కొలువులు లభించినట్లు డిప్లొమా ప్రిన్సిపాల్ కె.వి.కిరణ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఇంజినీరింగ్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.శివకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, ఎం.వి.జె.టి అరుణ్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 50 మంది ఎంపిక

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఆదినారాయణ మహిళా కళాశాలలో బుధవారం జరిగిన జాబ్ మేళాలో 50 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కొణతాల అనూష తెలిపారు. విశాఖలోని మద్దిలపాలేనికి చెందిన మ్యాజిక్ బస్ ఇండియా టెలికాలర్ పోస్టుకు, అచ్యుతాపురం యకహోమా టైర్స్ కంపెనీతో పాటు, జాబ్ డీలర్ కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించినట్లు పేర్కొన్నారు. 90 పోస్టులకు జరిగిన ఇంటర్వ్యూలో 50 మంది ఎంపికైనట్లు వెల్లడించారు. రెండు రోజుల్లో నియామకపత్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు నాగచరణ్, రాజు, నేహ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా పదో తరగతి పరీక్షల్లో 550 మార్కులు సాధించిన విద్యార్థులకు రామదాస్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఎన్టీపీసీ సౌజన్యంతో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కల్పిస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు కళాశాలలో చేరి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఎంపీసీ గ్రూపులో ప్రవేశాలకు దరఖాస్తులు

చీడికాడ: మండలంలోని జి.కొత్తపల్లి కేజీబీవీ లో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపులో ప్రవేశానికి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భారతి బుధవారం తెలిపారు. తమ విద్యాలయంలో ఇప్పటి వరకు ఎంఈసీ గ్రూపు ఉండేదని, ఈ విద్యా సంవత్సరం నుంచి దీని స్థానంలో ఎంపీసీని ప్రవేశ పెట్టారన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9490777506, 8919366443 సంప్రదించాలని సూచించారు.

‘రద్దీ వేళ రైళ్ల రద్దు తగదు’

అనకాపల్లి: వేసవి కాలంలో విద్యార్థులకు సెలవులు కావడంతో కుటుంబ సమేతంగా పుణ్యక్షేత్రాలు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో రద్దీకి అనుగుణంగా రైళ్ల సంఖ్యను పెంచాల్సింది పోయి, రైళ్లను రద్దు చేయడం అన్యాయమని కన్జ్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో ఆక్షేపించారు. ఈ విషయంపై రైల్వే బోర్డుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అత్యాధునిక వ్యవస్థ కలిగిన రైల్వేశాఖ ఏడాదిగా నిర్వహణ, ఆధునీకీకరణ పేరిట డిమాండ్ ఉన్న రైళ్లను రద్దు చేస్తోందన్నారు. ప్రయాణికుల హక్కుల్ని కాలరాసేలా రైల్వే అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏ పనికైనా రైల్వే సిటిజన్ చార్టర్ ప్రకారం నిర్దేశిత గడువులోగా పూర్తి చేయకుండా, ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే అన్ని రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

రాజారామ్‌మోహన్‌రాయ్ చిరస్మరణీయుడు

కశింకోట: మండలంలోని గొబ్బూరులో ప్రముఖ సంఘ సంస్కర్త రాజారామ్ మోహన్‌రాయ్ జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళాభ్యుదయానికి ఆయన చేసిన కృషిని ప్రస్తుతించారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఉగ్గిన రమణమూర్తి, పాల సంఘం అధ్యక్షుడు పప్పల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు



ఏవో సోమశేఖర్

గొలుగొండ: పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూసారం బాగా పెరుగుతుందని, దీనివల్ల దిగుబడులు బాగుంటాయని రైతులకు ఎరువుల ఖర్చు తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. జోగుంపేట రైతు భరోసా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట ఎరువులు సబ్సిడీపై పంపిణీ చేశారు. 10 కేజీల పచ్చిరొట్ట ఎరువులు రూ.440 ఉండగా, వాటిలో 50 శాతం రాయితీపై రైతులకు అందజేస్తున్నామని ఏవో తెలిపారు. కార్యక్రమంలో జోగుంపేట ఆర్బీకే అధికారి సత్యవేణి, రైతులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఖరీఫ్ సాగుకు ముందు రైతులు పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు వేయాలని మండల వ్యవసాయాధికారి పి.సోమశేఖర్ తెలిపారు. ఈ మేరకు 50 శాతం సబ్సిడీపై జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో వరినాట్లు జూలై రెండో నుంచి నాల్గో వారం వరకూ వేస్తారన్నారు. ఆ సమయంలో రైతులు పచ్చిరొట్ట ఎరువును పెంచి భూమిలో బాగా కలియదున్నాలని సూచించారు. ఈ విధంగా చేయడం వల్ల భూమిలో సూక్ష్మ ధాతువుల లోపాన్ని నివారించడంతోపాటు సారవంతం కానుందన్నారు. ఈ విధంగా తయారు చేసిన భూమిలో వర్షపునీటి నిల్వ సామర్థం మెరుగవుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులు కావల్సిన రైతులు ఆర్బీకేల ద్వారా పొందాలని సూచించారు.



పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు విక్రయానికి గాను రైతులు ముందస్తుగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు బుధవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి జనుము రూ.440, జీలుగ రూ.440, పిల్లి పెసర రూ.536 చొప్పున 50 శాతం సబ్సిడీపై విక్రయిస్తామన్నారు. ఆధార్ కార్డు తీసుకుని వచ్చి ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



దేవరాపల్లిలో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



చొడువాడలో పుస్తక పఠన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి

దేవరాపల్లి: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి ఓ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

కె. కోటపాడు: వేసవి శిక్షణ తరగతులతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని గ్రంథపాలకురాలు ఎం. పద్మావతి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం చొడువాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటపాటలతోపాటు చదువుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ప్రతిష్ట శతజయంతి ఉత్సవాలు



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అమ్మవారి ఆలయంలో శాంతిహోమం నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ట శతజయంతి ఉత్సవాల్లో భాగంగా వైశాఖమాసం పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రామనాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో నగర సంకీర్తన, గోపూజ, ప్రదక్షిణలు, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, నవకలశ స్నపనం, నీరాజన మంత్ర పుష్పములు, శాంతి హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అమ్మవారి ప్రతిష్ట శతజయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు స్టాప్ బోర్డుల అందజేత

కశింకోట: స్థానిక పోలీస్ స్టేషన్‌కు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ 50 స్టాప్ బోర్డులను సమకూర్చినట్లు సీఐ ఎం.వినోద్‌బాబు బుధవారం మీడియాకు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ఉపకరించే విధంగా రూ.3.50 లక్షలు వెచ్చించి వీటిని అందించారన్నారు. అనకాపల్లి డీఎస్పీ కార్యాలయానికి కూడా మరో 75 స్టాప్ బోర్డులు అందించినట్లు పేర్కొన్నారు. ఇందుకు పరిశ్రమ యాజమాన్యాన్ని, నిర్వాహకులను ఆయన అభినందించారు.

కార్యక్రమంలో మండలంలోని ఏఎస్ పేట వద్దనున్న సిమెంట్ పరిశ్రమ హెడ్ పి.వీరపాండ్యన్, ఎం.కళాధర్, హెచ్‌ఆర్ మేనేజర్ ఎం.యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



స్టాప్ బోర్డులతో కశింకోట సీఐ వినద్‌బాబు, రామ్‌కో సిమెంట్ ప్రతినిధులు